Follow: @ANNTELUGU
REGISTERED NUMBER APTEL/2014/58382
03-05-2026
ANN తెలుగు
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్ | సంపుటి- 23 | సంచిక- 126 | పేజీలు-04 | వెల-రూ.1
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD | ఆదివారం | WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్



## 200 ప్లస్ గెలుస్తాం
- దీదీ ధీమా

02

## బెట్టింగ్ మార్కెట్
- ఐదు రాష్ట్రాల ఫలితాలపై హల్ చల్
- టీఎంసీ బీజేపీ మధ్య క్లోజ్ ఫైట్




02

## 180కి పైగా గెలుస్తాం
- విజయ్ టీవీకే పార్టీ ధీమా
- విజయ్ దూరదృష్టితో రాష్ట్రాన్ని పాలిస్తారని వ్యాఖ్య



02



## పిఠాపురం పుడమిపై పవన్ ప్రగతి సంతకం

నిన్నటి నిరీక్షణకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెర
పిఠాపురానికి నిధుల పరుగులు
మాట తప్పని నాయకుడు.. మారుతున్న ముఖచిత్రం

(కాకినాడ- మహా)

మాట ఇవ్వడం సులభం. కానీ ఆ మాటను నిలబెట్టుకుంటూ ఊరి రూపు రేఖలను మార్చడం ఒక యజ్ఞం. జన హృదయ విజేత.. సంకల్ప బలమే ఆయుధంగా, ఇచ్చిన మాటను శాసనంగా మలచిన ధీశాలి. పిఠాపురం పుడమిపై అభివృద్ధి సంతకం చేస్తూ, ఆత్మీయతను పంచుతూనే.. ఆధునికతను ఆహ్వానిస్తున్న జననేత పవన్ కళ్యాణ్. నిన్నటి నిరీక్షణలకు నేడు నిధుల అక్షయపాత్రతో సమాధానమిస్తూ, పిఠాపురాన్ని ప్రగతి పథంలో పరుగులు తీయిస్తున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాట ప్రకారం పిఠాపురం నియోజకవర్గం మార్చే పనిలో ఉన్నారు. పిఠాపురం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయటం పైన దృష్టి సారించిన పవన్ కళ్యాణ్ కేంద్ర, రాష్ట్ర నిధులతో పిఠాపురానికి కొత్త రూపు సంతరించుకునేలా చేస్తున్నారు. పిఠాపురాన్ని ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చూపిస్తున్న తెగింపు, నిబద్ధత రాబోయే రోజుల్లో పిఠాపురాన్ని రాష్ట్రానికే తలమానికంగా నిలపడం ఖాయం.

**అభివృద్ధి విశేషాలు :**

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో పిఠాపురం నియోజకవర్గంలో జరుగుతున్న అద్భుత మార్పులు ఇవే:

**రైల్వే స్టేషన్ ఆధునికీకరణ:**
'అమృత్ భారత్' పథకంలో భాగంగా ₹37.25 కోట్లతో రైల్వే స్టేషన్‌ను అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దుతున్నారు. ఇది ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని అందించబోతోంది.

**వైద్య రంగంలో విప్లవం:**
పిఠాపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ, ₹34 కోట్లతో అత్యాధునిక వసతులు కల్పిస్తున్నారు. ప్రజల ముంగిటకే మెరుగైన వైద్యం చేరనుంది.

**రహదారుల నెట్‌వర్క్:**
నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 400 రోడ్ల నిర్మాణానికి ₹234 కోట్లు కేటాయించారు. కాకినాడ జిల్లా వ్యాప్తంగా మొత్తం ₹800 కోట్లతో రహదారుల అనుసంధాన ప్రక్రియ వేగవంతమైంది.

**తాగునీటి సరఫరా:**
ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యంగా ₹376 కోట్లతో భారీ నీటి సరఫరా పనులకు శ్రీకారం చుట్టారు.

**పారిశ్రామికాభివృద్ధి:**
స్థానికులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా MSME పార్కులు, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీలు మరియు గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ ఫ్యాక్టరీల ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి.

**మున్సిపాలిటీల హోదా పెంపు:**
పిఠాపురం మున్సిపాలిటీని సెలక్షన్ గ్రేడ్ స్థాయికి, గొల్లప్రోలు నగర పంచాయతీని గ్రేడ్3 మున్సిపాలిటీ స్థాయికి పెంచి, మెరుగైన పాలనకు మార్గం సుగమం చేశారు.




## కేంద్ర హోంమంత్రితో కాంతార స్టార్ రిషబ్ శెట్టి భేటీ

**భారతీయ సంస్కృతి, కళలపై అమిత్ షా పరిజ్ఞానానికి నటుడు ముగ్ధుడు**

**ఢిల్లీ, మహా:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'కాంతార' చిత్ర కథానాయకుడు, దర్శకుడు రిషబ్ శెట్టి తాజాగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాను మర్యాదపూర్వకముగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన వివరాలను రిషబ్ శెట్టి సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ తన సంతోషాన్ని వ్యక్తపరిచారు. కేంద్ర మంత్రిని కలవడం తన జీవితంలో అత్యంత చిరస్మరణీయమైన క్షణమని ఆయన అభివర్ణించారు.

మిగతా 2లో




## వెండితెరపై 'కృత్రిమ' మేధకు చెక్

- ఆస్కార్ చరిత్రలో అతిపెద్ద విప్లవం
- మానవ సృజనకే పట్టాభిషేకం!
- 2027 నుంచి కొత్త ఆస్కార్ రూల్స్
- ఒకే నటుడికి పలు నామినేషన్ల ఛాన్స్
- భారతీయ సినిమాలకు పెరగనున్న అవకాశాలు

**లాస్ ఏంజెల్స్,మహా:** ప్రపంచ సినీ సామ్రాజ్యంలో అత్యున్నత పురస్కారంగా వెలుగొందే 'ఆస్కార్' తన నిబంధనల్లో చారిత్రక మార్పులకు శ్రీకారం చుట్టింది. మారుతున్న కాలాన్ని, శరవేగంగా విస్తరిస్తున్న సాంకేతికతను దృష్టిలో ఉంచుకుని అకాడమీ బోర్డు కొన్ని సంచలన నిర్ణయాలు తీసుకుంది.

మిగతా 2లో

# రేవంత్ ఎలక్షన్ కేబినెట్ విస్తరణపై చర్చోపచర్చలు

## పనితీరు సరిగా లేని వారిపై వేటే.. పెద్దల శాఖల్లోనూ మార్పులు చేర్పులు

## జూన్ 2 నాటికి ఖాయమా? మరింత జాప్యమా?

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి రెండున్నరేళ్లు గడుస్తున్న తరుణంలో.. అటు పాలనలో వేగం పెంచడానికి, ఇటు 2028 ఎన్నికల వ్యూహాలను పకడ్బందీగా అమలు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గ ప్రక్షాళనకు సిద్ధమయ్యారన్న ప్రచారముంది. కేవలం ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా, పనితీరు సరిగా లేని వారిపై వేటు వేసి.. సరికొత్త 'ఎలక్షన్ క్యాబినెట్'ను రూపొందించాలని హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

**జూన్ 2 'డెడ్ లైన్'.. ఢిల్లీలో కసరత్తు**

కేరళ, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల హడావుడి ముగియగానే తెలంగాణపై అధిష్ఠానం పూర్తిస్థాయి దృష్టి సారించనుంది. మే 4న వెలువడనున్న ఫలితాల అనంతరం, మే 15 తర్వాత ఎప్పుడైనా మంత్రివర్గ విస్తరణ ఉండవచ్చని ప్రచారం జరుగుతోంది. జూన్ 2, రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి ముగ్గురు కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేసేలా ముహూర్తం ఖరారు చేశారా? లేక ఈ ఏడాది చివరిదాకా నెట్టుకొచ్చి సంపూర్ణ ప్రక్షాళన చేస్తారా? అన్నది చూడాల్సి ఉంది.

**శాఖల మార్పులు:**

ఎన్నికల హామీల అమలులో కీలకమైన రెండు, మూడు శాఖల మంత్రుల పనితీరుపై అధిష్ఠానం తీవ్ర అసంతృప్తితో ఉంది. వారిని తప్పించడం లేదా ప్రాధాన్యత లేని శాఖలకు పరిమితం చేయడం ఖాయంగా కనిపిస్తోంది. చాలా మంది పెద్దల శాఖలు కూడా మార్పులు చేర్పులు జరగవచ్చని తెలుస్తోంది. పెద్దలకు ప్రాధాన్యశాఖలు ఇచ్చినా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఇవి జరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. పదవులు కోల్పోయే సీనియర్లకు ఏఐసీసీ లేదా సీడబ్ల్యూసీ లో కీలక బాధ్యతలు అప్పగించి, వారి అనుభవాన్ని 2028 ఎన్నికల కోసం ఉపయోగించుకోవాలని పార్టీ భావిస్తోంది.

### రేసులో ఉన్న 'కీలక' నాయకులు

**మహేష్ కుమార్ గౌడ్:**
టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌ను మంత్రివర్గంలోకి తీసుకుని, 'డిప్యూటీ సీఎం' హోదా కట్టబెట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. దీని ద్వారా బీసీ సామాజిక వర్గానికి పెద్దపీట వేసినట్లవుతుందని అధిష్ఠానం యోచన.

**కోమటిరెడ్డి సోదరుల పోరు:**
మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తన కేబినెట్ బెర్త్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు. అయితే ఉమ్మడి నల్గొండ నుంచి ఇప్పటికే వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి మంత్రులుగా ఉండటం ఆయనకు ఇబ్బందిగా మారింది. 'సోదరుల్లో ఒకరికే ఛాన్స్' అనే నిబంధన విధిస్తే.. అది ఎవరికి దక్కుతుందనేది ఉత్కంఠ రేపుతోంది.

### సామాజిక సమీకరణలు

**మున్నూరు కాపు:** ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రేసులో ముందున్నారు.
**ఎస్టీ / బంజారా:** మహబూబాబాద్ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్, సీనియర్ బాలూ నాయక్ మధ్య పోటీ నెలకొంది.
**జిల్లా కోటా:** నిజామాబాద్ నుండి సుదర్శన్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.
**యాదవ :** బీర్ల ఐలయ్య, లేదా నవీన్ యాదవ్ పేర్లు ప్రచారంలో ఉన్నాయి.

**విస్తరణ కాదు.. ప్రక్షాళనే**

ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని మార్చడంతో పాటు, గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలకడమే ఈ 'ఎలక్షన్ క్యాబినెట్' ప్రధాన ఉద్దేశ్యం. స్పీకర్ ప్రసాద్ కుమార్ కూడా మంత్రి పదవి ఆశిస్తుండటం, మల్ రెడ్డి రంగా రెడ్డి వంటి సీనియర్లు పదవుల కోసం వేచి ఉండటంతో ఈ ప్రక్షాళన రేవంత్ రెడ్డికి కత్తి మీద సాము లాంటిదే. ప్రజలతో నేరుగా సంబంధం ఉండే శాఖల్లో సమర్థులను కూర్చోబెట్టడం ద్వారా.. 2028లో 'హ్యాట్రిక్' కొట్టాలనే లక్ష్యంతో కాంగ్రెస్ అడుగులు వేస్తోంది. మరి ఈ రాజకీయ సర్జరీలో ఎవరికి 'లైఫ్' దొరుకుతుంది, ఎవరికి 'చెక్' పడుతుందో వేచి చూడాలి.





# ఉద్యోగులకు వరాల జల్లు

## 100 రోజుల్లో రూ. 6 వేల కోట్ల బకాయిల విడుదల

- జూన్ 1కల్లా ఆరోగ్య భద్రత కార్డులు
- పీఆర్‌సీపై తక్షణ నివేదికకు ఆదేశం
- నిధుల వ్యయంలో ఉద్యోగులకే నిర్ణయాధికారం
- రెండు ఏళ్లలో 67,760 నియామకాలు
- ఉద్యోగుల సంక్షేమమే మా ప్రాధాన్యత
- సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వరాల జల్లు కురిపించారు. శనివారం సచివాలయంలో ఉద్యోగ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ప్రతినిధులతో నిర్వహించిన కీలక భేటీలో ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం ఉన్న చిత్తశుద్ధిని ఆయన చాటిచెప్పారు. ప్రధానంగా కొత్త వేతన సవరణ కమిషన్ నివేదికను తక్షణమే సమర్పించాలని అధికారుల కమిటీని ఆదేశించినట్లు వెల్లడించిన ముఖ్యమంత్రి, ఆ నివేదిక అందిన వెంటనే పీఆర్‌సీపై తుది నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సంబంధించి సుమారు రూ. 6 వేల కోట్ల రిటైర్మెంట్ బకాయిలను రాబోయే 100 రోజుల్లోగా పూర్తిగా చెల్లించనున్నట్లు ప్రకటించారు. ఈ నిధుల వ్యయంలో ప్రాధాన్యతలను నిర్ణయించే బాధ్యతను ఉద్యోగ సంఘాలకే అప్పగిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు.

మిగతా 2లో

## తండ్రిగా ఓకే.. రాజకీయంగా పోరే

**కేసీఆర్ మీద విమర్శలపై టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత**

**ఉచిత వైద్యం.. నాణ్యమైన విద్యే టీఆర్ఎస్ లక్ష్యం**
**హామీలు నెరవేర్చకుంటే రాళ్లతో కొట్టండి**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య, వైద్యం ఉచితంగా ఇవ్వకుంటే రాళ్లతో కొట్టాలని పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. తామిచ్చిన పాంచజన్యంలో పేర్కొన్న ఐదు అంశాలను అమలు చేయకుంటే గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపం స్తంభానికి కట్టేసి కొట్టాలన్నారు. హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కల్వకుంట్ల

మిగతా 2లో







## కిషన్ రెడ్డి వాల్ రైటింగ్

- ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో బీజేపీ ప్రచార జోరు
- గోడపై నినాదాలు రాసి ప్రచారం ప్రారంభించిన కేంద్రమంత్రి

**హైదరాబాద్, మహా:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ ప్రచార

మిగతా 2లో

## 200 ప్లస్ గెలుస్తాం

### దీదీ ధీమా

**కోల్ కతా:** ఈ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ 200కు పైగా స్థానాల్లో విజయం సాధిస్తుందని మమత బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు .పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ.. కోల్ కతలో పార్టీ నాయకులతో వర్చువల్ గా సమావేశం అయ్యారు. పార్టీ ఎంపీ అభిషేక్ బెనర్జీ సహా పలువురు సీనియర్ నేతలు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తిప్పి కొట్టారు. స్టాక్ మార్కెట్‌ను తారుమారు చేసే ప్రయత్నంగా కొట్టిపడేశారు. 2021 నాటి ఫలితాలు పునరావృత మౌతాయని తేల్చి చెప్పారు. అప్పుడు కూడా అన్ని ఎగ్జిట్ పోల్స్ బీజేపీకి పట్టం కట్టాయని గుర్తు చేశారు. ఇప్పుడూ అదే పరిస్థితి ఉంటుందని అన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ నాయకులు చేసిన అవిశ్రాంత పోరాటానికి అభినందనలు తెలిపారు. తమ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆమె పునరుద్ఘాటించారు. తాము విజయం సాధించబోతోన్నామని, 200లకు పైగా సీట్ల లభిస్తాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యం కోల్పోవద్దని అన్నారు.

## కేంద్ర హోంమంత్రితో 'కాంతార' స్టార్ రిషబ్ శెట్టి భేటీ

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యంగా 'కాంతార' చిత్రంతో పాటు ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న 'కాంతార చాప్టర్ 1' గురించి అమిత్ షా అడిగి తెలుసుకోవడమే కాకుండా, సినిమాలోని కథాంశాన్ని, చిత్రీకరణ శైలిని ప్రశంసించడం విశేషం.ఈ సమావేశం కేవలం సినిమా ముచ్చట్లకే పరిమితం కాకుండా భారతీయ చరిత్ర, వారసత్వం, కళలు మరియు సంస్కృతిపై లోతైన చర్చకు వేదికైంది. అమిత్ షాకు భారతీయ చరిత్రపై ఉన్న అపారమైన జ్ఞానం, సినిమా మేకింగ్‌లోని మెళకువలపై ఆయనకున్న అవగాహన చూసి రిషబ్ శెట్టి ఆశ్చర్యపోయారు. మన దేశ మూలాలను, కళా వైభవాన్ని అమిత్ షా విశ్లేషించిన తీరు తనను ఎంతో ప్రభావితం చేసిందని రిషబ్ పేర్కొన్నారు. తన భవిష్యత్తు ప్రాజెక్టుల గురించి కూడా హోంమంత్రితో చర్చించానని, ఆయన అందించిన ప్రోత్సాహం తనలో మరింత బాధ్యతను పెంచిందని వెల్లడించారు.

## కిషన్ రెడ్డి వాల్ రైటింగ్

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి గోడలపై నినాదాలు రాసి అందరినీ ఆశ్చర్యపరిచారు. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో ఈ ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ నెల 10వ తేదీన సాయంత్రం 4 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాని మోదీ పాల్గొనే భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ సభకు ప్రజలను ఆహ్వానిస్తూ "ఛలో పరేడ్ గ్రౌండ్స్" అంటూ కిషన్ రెడ్డి స్వయంగా కుంచె పట్టి గోడపై రాశారు. అనంతరం బీజేపీ ఎన్నికల గుర్తు అయిన కమలం పువ్వును కూడా ఆయనే చిత్రించడం విశేషం. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ అభివృద్ధి, పురోగతి దార్శనికతపై ప్రజలు, కార్యకర్తలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని, వారి ఉత్సాహమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న బహిరంగ సభకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రమంత్రి స్వయంగా వాల్ రైటింగ్ చేస్తున్న ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## తండ్రిగా ఓకే.. రాజకీయంగా పోరే

(మొదటిపేజీ తరువాయి)

కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తన తండ్రి కేసీఆర్‌తో ఎలాంటి పంచాయితీ లేదని.. బీఆర్ఎస్ అధ్యక్షుడిగానే ఆయన్ను విమర్శించానని చెప్పారు. కేసీఆర్‌ను రాజకీయ నేతగానే విమర్శించానని, తండ్రిగా ఆయనతో ఎలాంటి సమస్య లేదని చెప్పారు. యువత ఇక ఉద్యోగాల కోసం దేబిరించే 'జాబ్ సీకర్స్'గా కాదు.. పది మందికి ఉపాధి కల్పించే 'జాబ్ క్రియేటర్స్'గా ఎదగాలి.. ఎంతటి ప్రాణాంతక వ్యాధికైనా పేదలకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యం దక్కాలి.." ఇదే ప్రధాన ఎజెండాగా తెలంగాణ రక్షణ సేన (తెరాస) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త విధానపరమైన చర్చకు తెరతీశారు. శనివారం బషీర్‌బాగ్‌లో జరిగిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో కాంగ్రెస్ వైఫల్యాలపై నిప్పులు చెరిగిన ఆమె.. అకాల వర్షాలకు ధాన్యం కుప్పల వద్ద కల్లాల్లోనే ప్రాణాలు విడుస్తున్న రైతుల దుస్థితి, దళిత బహుజనుల సబ్‌ప్లాన్ నిధుల దారిమళ్లింపు తదితర అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సూటిగా నిలదీశారు. ముఖ్యమంత్రిది సొంత నిర్ణయాలు లేని 'ఢిల్లీ సిమ్ కార్డు' పాలన అంటూ చురకలు అంటిస్తూనే, కేవలం విమర్శలకు పరిమితం కాకుండా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దిశానిర్దేశం చేసే ఐదు ప్రధాన అంశాలతో కూడిన 'పంచసూత్ర విధాన పత్రాన్ని' ప్రజల ముందుంచారు.

# ఉద్యోగులకు వరాల జల్లు

(మొదటిపేజీ తరువాయి)



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి మరియు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగుల చిరకాల వాంఛ అయిన ఆరోగ్య భద్రత కార్డులపై ముఖ్యమంత్రి స్పష్టతనిచ్చారు. జూన్ 1వ తేదీ లోపు ఉద్యోగులందరికీ నూతన ఆరోగ్య భద్రత కార్డులను అందజేస్తామని, నగదు రహిత చికిత్స అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సంక్షేమ పథకాన్ని తమ భుజాన వేసుకుని విజయవంతం చేస్తున్న ఉద్యోగుల కృషిని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అభినందించారు. ఇది పూర్తిగా ఉద్యోగుల స్నేహపూర్వక ప్రభుత్వమని, సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ తలుపులు తెరిచే ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. ఇకపై ప్రతి రెండు నెలలకు ఒకసారి ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ప్రభుత్వంతో సమావేశమై, పెండింగ్‌లో ఉన్న సమస్యలపై నివేదికలు అందించాలని ఒక క్రమబద్ధమైన వ్యవస్థను ప్రతిపాదించారు.తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే ఉద్యోగుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. దశాబ్ద కాలంగా అస్తవ్యస్తంగా ఉన్న వ్యవస్థను చక్కదిద్దుతూ, ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులందరికీ వేతనాలు అందేలా చర్యలు తీసుకున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఉద్యోగ సంఘాలు స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించుకునేలా ప్రజాస్వామ్యబద్ధమైన వాతావరణాన్ని కల్పించామని, ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలను ఎటువంటి గందరగోళం లేకుండా, పారదర్శకమైన ప్రణాళికతో పూర్తి చేశామని చెప్పారు. గత రెండేళ్ల కాలంలోనే రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 67,760 ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టి నిరుద్యోగుల ఆశలను నెరవేర్చామని వివరించారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములైన ఉద్యోగులకు అన్ని విధాలా అండగా ఉంటామని, ఆరోగ్య భద్రత కార్డుల ప్రతిపాదనపై ప్రభుత్వం అత్యంత సానుకూల ధోరణితో ఉందని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.ఈ సమావేశంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల నాయకులు మారం జగదీష్, వి. లచ్చి రెడ్డి, ఏలూరి శ్రీనివాస రావు, జి. శ్రీనివాస్ రెడ్డి, పి. దామోదర్ రెడ్డి తదితర ప్రతినిధులు ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేశారు. గత పదేళ్లలో పరిష్కారం కాని అనేక సమస్యలకు ఈ ప్రజా ప్రభుత్వంలో మోక్షం లభించిందని వారు కొనియాడారు. ముఖ్యమంత్రి ఇచ్చిన స్పష్టమైన హామీల నేపథ్యంలో, మే 5వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన నిరసన కార్యక్రమాలతో పాటు అన్ని రకాల ఆందోళనలను తక్షణమే ఉపసంహరించుకుంటున్నట్లు సంఘాల నేతలు సంయుక్తంగా ప్రకటించారు. దీంతో రాష్ట్రంలో ప్రభుత్వానికి, ఉద్యోగ వర్గాలకు మధ్య ఉన్న వివాదాలు సద్దుమణిగి, ఒక సానుకూల వాతావరణం నెలకొంది. తమపై నమ్మకం ఉంచిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రభుత్వ ఆశయ సాధనలో మరింత ఉత్సాహంతో పనిచేస్తామని ఉద్యోగ సంఘాల నేతలు వెల్లడించారు.

# తండ్రిగా ఓకే.. రాజకీయంగా పోరే

(మొదటిపేజీ తరువాయి)



కవిత ప్రకటించిన పంచసూత్ర అజెండాలో అత్యంత కీలకమైనది ప్రజారోగ్యం. ప్రస్తుత రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలకు ఉన్న పరిమితుల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు జేబులోంచి డబ్బులు పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయి నుండి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల వరకు "ఎంత పెద్ద రోగం వచ్చినా ఉచితంగా వైద్యం చేయిస్తామని" ఆమె హామీ ఇచ్చారు. ఆరోగ్య భద్రతను విలాసంగా కాకుండా పౌరుడి ప్రాథమిక హక్కుగా మార్చి, వైద్య ఖర్చుల వల్ల పేదరికంలోకి నెట్టబడుతున్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

### వ్యాపార వస్తువుగా మారిన విద్యకు ప్రక్షాళన

ప్రజాస్వామ్య సాధికారతకు మూలస్తంభమైన విద్యారంగాన్ని ప్రక్షాళన చేయడం తమ పార్టీ రెండవ ప్రధాన అజెండాగా కవిత పేర్కొన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థలకు, కనీస వసతులు లేని ప్రభుత్వ పాఠశాలలకు మధ్య అంతరం తీవ్రమవుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. విద్యను ఒక వ్యాపార వస్తువుగా కాకుండా ప్రభుత్వ బాధ్యతగా చూడాలని హితవు పలికారు. కేవలం ఉచితంగా మాత్రమే కాకుండా 'నాణ్యత'తో కూడిన విద్యను అందించడం ద్వారానే సామాజిక చలనశీలతను సాధించి, తరతరాల పేదరికాన్ని నిర్మూలించగలమని ఆమె తన అజెండాలో బలంగా వినిపించారు.

### ఉద్యోగాల కోసం నిరీక్షణ వద్దు.. యజమానులుగా ఎదగాలి

నిరుద్యోగ సమస్యపై దశాబ్దాలుగా సాగుతున్న మూస పద్ధతులకు భిన్నంగా కవిత వినూత్న దృక్పథాన్ని ఆవిష్కరించారు. యువత, మహిళలు కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూసే జాబ్ సీకర్స్ స్థాయిలో ఉండిపోకుండా, పది మందికి ఉపాధి కల్పించే జాబ్ క్రియేటర్స్‌గా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ప్రభుత్వాలు ఇస్తున్న అరకొర ఉపాధి హామీలు హాస్యాస్పదంగా మారాయని విమర్శించిన ఆమె, పెట్టుబడిదారీ వ్యవస్థలో భాగస్వామ్య సాధికారతను సాధించే దిశగా తమ పార్టీ ఆర్థిక ప్రణాళికలను అమలు చేస్తుందని ఉద్ఘాటించారు.

### రూ. 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణాలు

యువతను, మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వీలుగా కవిత సంచలనాత్మక ప్రకటన చేశారు. వారి నైపుణ్యాలు, ప్రాజెక్టుల ఆధారంగా రూ. 2 లక్షల నుంచి ఏకంగా రూ. 20 కోట్ల వరకు రుణాలు అందించేలా విధానాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగం ఊహించని స్థాయిలో వృద్ధి చెందుతుందని, స్వయం సహాయక సంఘాల మహిళలు కార్పొరేట్ స్థాయికి ఎదుగుతారని విశ్లేషించారు. దీనికి తోడు ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను సైతం తక్షణమే భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.

### ధాన్యం కుప్పలపైనే రైతుల ప్రాణాలు గాలిలోకి..

తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న దారుణ పరిస్థితులపై కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలోనే వరి ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్న రాష్ట్రంలో, అకాల వర్షాలకు తడుస్తున్న ధాన్యాన్ని చూసి తట్టుకోలేక గుట్టలుగా పోసిన కుప్పల పైనే రైతులు ప్రాణాలు విడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా వ్యవహరిస్తున్న నిర్లక్ష్యమే ఈ హృదయవిదారక వాస్తవాలకు కారణమని ఆమె సూటిగా ఆరోపించారు.

### సమన్వయ లోపంతోనే దారుణ పరిస్థితులు

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు రోజుల తరబడి పడిగాపులు కాయడానికి వ్యవస్థాగత లోపాలే కారణమని కవిత ఎత్తిచూపారు. భారత ఆహార సంస్థ (FCI), రాష్ట్ర పౌర సరఫరాల శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగానే కేంద్రాల్లో నిల్వలు పేరుకుపోతున్నాయని, బీజేపీ మరియు కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాన్ని ఏకకాలంలో ఎండగట్టారు. కొనుగోలు కేంద్రాల్లో కనీసం టార్పాలిన్లు, గోనె సంచులు, తూకపు యంత్రాలు లేకపోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనాపరమైన అలసత్వానికి నిదర్శనమని విమర్శించారు.

### ఆచరణకు నోచుకోని హామీలు.. గాడితప్పిన పాలన

ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యంకాని గ్యారంటీలు ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తిగా విస్మరించిందని కవిత మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి పాలన గాడితప్పిందని, మంత్రుల మధ్య కనీస సమన్వయం లేకుండా అధికారుల బదిలీల చుట్టూనే ప్రభుత్వ యంత్రాంగం తిరుగుతోందని విమర్శించారు. ఎన్నికల మ్యానిఫెస్టోకు, వాస్తవ అమలుకు పొంతన లేకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం అతి తక్కువ కాలంలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని ఆమె విశ్లేషించారు.

### సబ్-ప్లాన్ నిధుల మళ్లింపు దారుణం

బహుజన, దళిత, మైనార్టీ వర్గాల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్ట ప్రకారం జనాభా నిష్పత్తిలో ఆయా వర్గాలకే ఖర్చు చేయాల్సిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ప్రభుత్వం దారి మళ్లిస్తోందని ఆరోపించారు. అలాగే, పేద విద్యార్థులు విదేశాల్లో చదువుకునేందుకు ఉద్దేశించిన 'ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల' ఊసే ఎత్తకపోవడం వెనుక వారిని ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర దాగి ఉందని, సామాజిక న్యాయం కేవలం మాటలకే పరిమితమైందని దుయ్యబట్టారు.

### ముఖ్యమంత్రి ఇక్కడ.. 'సిమ్ కార్డు' ఢిల్లీలో!

ప్రెస్ మీట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా కవిత చేసిన "ఢిల్లీ సిమ్ కార్డు" వ్యాఖ్య తీవ్ర రాజకీయ చర్చకు దారితీసింది. "ముఖ్యమంత్రి ఇక్కడ ఉన్నా.. ఆయన సిమ్ కార్డు మాత్రం ఢిల్లీలో ఉంది" అంటూ ఆమె వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణ ఉద్యమ ఆత్మగౌరవ నినాదమైన 'స్వయంపాలన'ను దెబ్బతీస్తూ, ప్రతి చిన్న నిర్ణయానికీ కాంగ్రెస్ అధిష్టానం కనుసన్నల్లో పనిచేయాల్సి రావడం రాష్ట్ర ప్రయోజనాలకు భంగకరమని, రాష్ట్ర పాలకుల రిమోట్ కంట్రోల్ ఢిల్లీలో ఉండకూడదని ఆమె స్పష్టం చేశారు.

### సచివాలయంలో దివ్యాంగుల పట్ల మానవత్వమేది?

ప్రభుత్వ దార్శనికతా లోపాన్ని ఎత్తిచూపే క్రమంలో కవిత సచివాలయంలోని వసతుల లేమిని ప్రస్తావించారు. వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలు కచ్చితంగా దివ్యాంగులకు అనుకూలంగా ఉండాలన్న నిబంధనను పక్కనపెట్టి, నూతన సచివాలయంలో వారికి కనీస వసతులు కల్పించకపోవడం మానవత్వ రాహిత్యానికి సజీవ నిదర్శనమన్నారు. హైడ్రా లాంటి రాజకీయ ప్రతీకార చర్యలపై చూపే శ్రద్ధ, సామాన్యులు, సున్నిత వర్గాల సౌకర్యాలపై పాలకులు చూపడం లేదని ఆమె కడిగిపారేశారు.

# తెలంగాణ విద్యుత్ వ్యవస్థకు ఏఐ పహారా



- జిల్లాకు రెండు సోలార్ ప్లాంట్లు
- రైతు డిస్కంపై అపోహలు వద్దు
- సబ్‌స్టేషన్ల పక్కనే సోలార్ విద్యుత్ ఉత్పత్తి
- పైలట్ ప్రాజెక్టుగా 18 ప్లాంట్లు ఖరారు
- సబ్‌స్టేషన్ల నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో శరవేగంగా విస్తరిస్తున్న పారిశ్రామికీకరణ, ప్రాంతీయ రింగ్ రోడ్డు, హైస్పీడ్ రైల్ కారిడార్ల వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు అనుగుణంగా విద్యుత్ సరఫరా వ్యవస్థను పటిష్టం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో పెరగనున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, కొత్త పారిశ్రామిక వాడలకు అవసరమైన సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులను యుద్ధప్రతిపాదికన ప్రారంభించాలని స్పష్టం చేశారు. శనివారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎంపీ వేం నరేందర్ రెడ్డి మరియు ఇంధన శాఖ ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి విద్యుత్ రంగంపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరాలో ఆధునిక సాంకేతికతను జోడించడంతో పాటు, గ్రీన్ ఎనర్జీకి పెద్దపీట వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా విద్యుత్ సబ్‌స్టేషన్ల పక్కనే సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలన్న వినూత్న ఆలోచనను ముఖ్యమంత్రి తెరపైకి తెచ్చారు. తొలుత పైలట్ ప్రాజెక్ట్ కింద హైదరాబాద్ మినహా ఉమ్మడి తొమ్మిది జిల్లాల్లో జిల్లాకు రెండు చొప్పున మొత్తం 18 సోలార్ ప్లాంట్లను నిర్మించాలని ఆదేశించారు. భూమి అందుబాటులో ఉన్న చోట ఈ ప్రయోగాత్మక ప్లాంట్లను వెంటనే నెలకొల్పాలని, వీటికి పర్యవేక్షకులుగా నోడల్ అధికారులను నియమించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుండి సబ్‌స్టేషన్ వరకు ప్రసార నష్టాలను తగ్గించేందుకు ఈ విధానం దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే భారీ డేటా సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను వెంటనే మంజూరు చేయాలని, గ్రీన్ ఎనర్జీ పాలసీ కింద దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యత క్రమంలో అనుమతులు ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు.విద్యుత్ సరఫరా వ్యవస్థలో లోపాలను గుర్తించడానికి మరియు పంపిణీని మెరుగుపరచడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఏఐ సాంకేతికత ద్వారా విద్యుత్ చౌర్యాన్ని అరికట్టడంతో పాటు, ఎక్కడైనా అంతరాయాలు కలిగితే తక్షణమే గుర్తించి సరిచేసే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. మరోవైపు సామాన్యులకు సోలార్ శక్తిని చేరువ చేసేందుకు స్వయం సహాయక సంఘాల మహిళలకు సోలార్ పవర్ పైన ప్రత్యేక అవగాహన కల్పించాలని, గ్రామీణ ప్రాంతాల్లో సోలార్ స్టౌల వినియోగం పెరిగేలా ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇక తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ఏర్పాటుపై విద్యుత్ శాఖ ఉద్యోగులు మరియు సిబ్బందిలో ఉన్న అపోహలను తొలగించాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇది పూర్తిగా రైతుల ప్రయోజనాల కోసం ఉద్దేశించినదని, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో ఇంధన శాఖ కార్యదర్శి, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీలు ఇతర సీనియర్ అధికారులు పాల్గొని, రాష్ట్రంలో విద్యుత్ నిల్వలు మరియు భవిష్యత్ ప్రణాళికలను ముఖ్యమంత్రికి వివరించారు.

## 180కి పైగా గెలుస్తాం

- విజయ్ టీవీకే పార్టీ ధీమా
- విజయ్ దూరదృష్టితో రాష్ట్రాన్ని పాలిస్తారని వ్యాఖ్య

**మహా:** తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో, విజయ్ నేతృత్వంలోని తమ పార్టీ 234 స్థానాలకు గాను 180 నుంచి 200 నియోజకవర్గాల్లో విజయం సాధిస్తుందని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఎగ్జిక్యూటివ్ చీఫ్ కోఆర్డినేటర్ కేఏ సెంగొట్టయాన్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ పార్టీ కూడా మెజారిటీ సాధించదనే పరిస్థితి ఉందదని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కావాల్సిన స్థానాలు తాము తప్పకుండా గెలుస్తామని, విజయ్ ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. తమ నాయకుడు విజయ్ దూరదృష్టితో పాలన అందిస్తారని పేర్కొన్నారు. 2026 ఎన్నికల విజయం తమకు చారిత్రాత్మకమైనదని అన్నారు. విజయ్ రాత్రనగ, పగలనక కష్టపడ్డారని, ఎన్నో పరీక్షలను ఎదుర్కొన్నారని, మే 4న వచ్చే ఫలితమే సమాధానం చెబుతుందని అన్నారు. ఎన్నికల అనంతరం పొత్తు వార్తలను ఆయన కొట్టిపారేశారు. తమకు స్పష్టమైన మెజారిటీ వస్తుందని తెలిపారు.

## కేసీఆర్ కోవర్ట్ మంత్రి ఉత్తమ్

- కాళేశ్వరం కంటే ఉత్తమ్ శాఖలోనే అవినీతి అధికం
- ఆస్తులు పెంచుకోవడంపైనే సీఎం రేవంత్ శ్రద్ధ
- కాంగ్రెస్ నేతలపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఫైర్

**నిజామాబాద్, మహా :** కాంగ్రెస్ నేతలపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గ్యాస్ ధరల పెరుగుదలపై రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలను 'పిల్ల చేష్టలు'గా అభివర్ణించారు. కనీసం దుస్తులు, చెప్పులు కూడా సరిగా వేసుకోవడం తెలియని వ్యక్తి దేశంలో ప్రధాన విపక్ష నేతగా ఉండటం సిగ్గుచేటంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదవి చేపట్టిన తర్వాత ప్రజాక్షేమం కంటే తన కుటుంబ సభ్యుల ఆస్తులు పెంచుకోవడంపైనే ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారని అర్వింద్ ఆరోపించారు. రేవంత్ పాలనలో రాష్ట్రానికి చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని ఆయన విమర్శించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు 'కోవర్ట్' అని సంబోధిస్తూ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని శాఖల కంటే సివిల్ సప్లై శాఖలోనే భారీగా అవినీతి జరుగుతోందని అన్నారు. ఇరిగేషన్ శాఖలో కూడా కేసీఆర్ మనుషులనే ఉద్యోగులుగా కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి కంటే ఉత్తమ్ శాఖలో జరుగుతున్న అవినీతి పెద్దదని ఆయన వ్యాఖ్యానించారు. కాళేశ్వరం అక్రమాల విషయంలో కేసీఆర్ కుటుంబాన్ని రక్షించేందుకు రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.

# వెండితెరపై 'కృత్రిమ' మేధకు చెక్

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యంగా ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' ప్రభావం వెండితెర అసలు ఆత్మను దెబ్బతీయకూడదని భావించిన అకాడమీ, మానవ సృజనాత్మకతకే పట్టాభిషేకం చేయాలని నిశ్చయించుకుంది. సినిమా అంటే కేవలం రంగులు, హంగులు మాత్రమే కాదని, అది ఒక మనిషి హృదయంలో పుట్టిన అద్భుత భావోద్వేగం అని ఈ సందర్భంగా బోర్డు చాటిచెప్పింది.ఈ ప్రాథమిక సూత్రాన్ని గౌరవిస్తూ, ఇకపై పూర్తిగా కృత్రిమ మేధతో రూపొందించిన కంటెంట్‌ను ఆస్కార్ అవార్డుల పోటీకి అనుమతించబోమని బోర్డు స్పష్టం చేసింది. సాంకేతికతను ఒక సాధనంగా వాడుకోవచ్చు కానీ, అది మనిషి స్థానాన్ని భర్తీ చేయకూడదని బోర్డు తేల్చిచెప్పింది. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్లు సృష్టించే బొమ్మలు, మాటల కంటే మనిషి స్వయంగా తన కష్టంతో, మేధస్సుతో సృష్టించే కళకే అత్యున్నత గౌరవం దక్కాలని ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇది భవిష్యత్తులో నిజమైన రచయితలకు, దర్శకులకు మరియు సాంకేతిక నిపుణులకు కొండంత అండగా నిలవనుంది. యంత్రాల సృష్టికి ప్రాణం ఉండదని, కేవలం మనిషి మేధస్సుతోనే అసలైన కళాఖండాలు పుడతాయని అకాడమీ నమ్ముతోంది.సాంకేతిక నియంత్రణలతో పాటు నామినేషన్ల ప్రక్రియలోనూ అకాడమీ విప్లవాత్మక మార్పులు తెచ్చింది. గతంలో ఉన్న కొన్ని పాత నిబంధనలను సడలిస్తూ ఇకపై ఒకే దేశం నుంచి ఒకటి కంటే ఎక్కువ చిత్రాలు ప్రధాన విభాగాల్లో పోటీ పడేందుకు మార్గం సుగమం చేశారు. ఇది భారతీయ సినిమా వంటి విభిన్న కళాఖండాల గని కలిగిన పరిశ్రమలకు అంతర్జాతీయ వేదికపై తమ సత్తా చాటేందుకు దక్కిన గొప్ప అవకాశం. దీనికి అదనంగా ఒకే నటుడు వివిధ సినిమాల్లో చూపించిన అద్భుత నటనకు గానూ వేర్వేరు నామినేషన్లు పొందే అరుదైన వెసులుబాటును కూడా కల్పించారు. దీనివల్ల నటుల విలక్షణమైన ప్రతిభకు తగిన గుర్తింపు లభించడమే కాకుండా, ప్రపంచవ్యాప్త ప్రేక్షకులకు అత్యుత్తమ ప్రదర్శనలను ఆస్వాదించే వీలు కలుగుతుంది.ఈ చారిత్రక మార్పులన్నీ 2027లో వైభవంగా జరగనున్న 99వ అకాడమీ అవార్డుల వేడుక నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నిర్ణయంపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రముఖుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. అకాడమీ తీసుకున్న ఈ సాహసోపేతమైన నిర్ణయాలు కొత్త ప్రతిభకు పట్టాభిషేకం చేస్తాయని, ముఖ్యంగా ప్రాంతీయ భాషా చిత్రాలకు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తెస్తాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఆస్కార్ బోర్డు తీసుకున్న ఈ 'సెన్సేషనల్' నిర్ణయం వెండితెరపై మనిషి మేధస్సును, శ్రమను గౌరవించే దిశగా ఒక నవశకానికి నాంది పలకబోతోంది.

# బెట్టింగ్ మార్కెట్

### ఐదు రాష్ట్రాల ఫలితాలపై హల్ చల్.. టీఎంసీ- బీజేపీ మధ్య క్లోజ్ ఫైట్

**మహా:** దేశవ్యాప్తంగా అక్రమ బెట్టింగ్ సైట్లు, ప్రెడిక్షన్ మార్కెట్లలో ఈ ఎన్నికలు హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఫలితాలపై భారీ మొత్తాలు బెట్ అవుతున్నాయి. బెంగాల్‌లో టీఎంసీ బీజేపీ మధ్య సీట్ల సంఖ్య, తమిళనాడులో డీఎంకే ఇతరుల మధ్య ఫలితాలు బెట్టర్లను ఆకర్షిస్తున్నాయి. ఈ బెట్టింగ్ సాధారణ యువకులు, వ్యాపారుల నుంచి పెద్ద మొత్తాలు ఆకర్షిస్తోంది. అయితే ఇది చట్టవిరుద్ధం కావడం, ఆర్థిక నష్టాలు, జీవితాలను ఛిన్నాభిన్నం చేయనుంది. బెంగాల్, తమిళనాడు ఫలితాలు భిన్న సర్వేలతో ఉత్కంఠ కలిగిస్తున్నాయి.





# లక్కీ ఛాన్స్ కొట్టింది మామా..

## నందమూరి హీరోతో స్టెప్పులు వేయనున్న కయాదు లోహర్..

కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి వచ్చి తన అందచందాలతో కుర్రకారును ఆకట్టుకున్న ఈ అమ్మడు, ఇప్పుడు టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయింది. కేవలం గ్లామర్ మాత్రమే కాదు, నటనలోనూ మంచి మార్కులు కొట్టేయడం వల్లనే అగ్ర దర్శకుల కన్ను ఈ భామపై పడింది. ముఖ్యంగా అనిల్ రావిపూడి ఈమెకు పెద్ద పీట వేస్తున్నారు.దర్శకుడు అనిల్ రావిపూడి తన సినిమాల్లో హీరోయిన్ల పాత్రలను చాలా ఎనర్జిటిక్‌గా చూపిస్తారు. ఆయన సినిమాల్లో నటించే అవకాశం రావడమే గొప్ప విషయం.అలాంటిది ఏకంగా ఒకేసారి రెండు భారీ సినిమాల్లో కాయదు లోహర్‌ను ఎంపిక చేయడం చూస్తుంటే, ఈమె రేంజ్ ఏంటో ఇట్టే అర్థమవుతోంది.ముందుగా విక్టరీ వెంకటేష్ సరసన నటించే గోల్డెన్ ఛాన్స్ కాయదు లోహర్‌కు దక్కింది. అనిల్ రావిపూడి  వెంకటేష్ కాంబినేషన్‌లో వస్తున్న కొత్త సినిమాలో ఈమెను హీరోయిన్‌గా ఎంపిక చేశారట.నిజానికి కాయదు లోహర్ ఇండస్ట్రీకి కొత్తేమీ కాదు. కన్నడలో కొన్ని సినిమాలతో మెప్పించినా, సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తోంది. తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ కొత్త టాలెంట్‌ను ప్రోత్సహిస్తారు.ఆ నమ్మకంతోనే ఈమె టాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. అనిల్ రావిపూడి దొరకడం ఈమె కెరీర్‌కు ప్లస్ పాయింట్‌గా మారనుంది.



# పెళ్లైన ఐదేళ్లకే సాహో నటి విడాకులు..!

ప్రముఖ నటి ఎవలీన్ శర్మ తన భర్తతో విడిపోతున్నట్లు ప్రకటించింది. తమ ఐదేళ్ల వివాహ బంధానికి గుడ్ బై చెప్పనుంది. ఈ విషయాన్ని తాజా ఇంటర్వ్యూలో వెల్లడించింది. ఈ విషయంపై ఓ ఛానెల్‌లో మాట్లాడిన ఆమె.. అవును మేమిద్దరం పరస్పరం అంగీకారంతోనే విడిపోవాలని నిర్ణయించుకున్నామని తెలిపింది. పిల్లల విషయంలో ఇద్దరం బాధ్యత తీసుకుంటామని పేర్కొంది. ఇలాంటి మేము గోప్యతను కోరుకుంటున్నామని అన్నారు.  కాగా.. నటి ఎవలిన్ శర్మ 2021 మే 15న డెంటల్ సర్జన్ అయిన తుషాన్ బిందీని పెళ్లాడారు. వీరికి కుమార్తె ఆవా, కుమారుడు ఆర్డెన్ అనే ఇద్దరు పిల్లలు జన్మించారు. పెళ్లైన ఐదేళ్లకే ఈ జంట విడాకులు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. స్నేహపూర్వకంగా తమ బంధానికి ముగింపు పలుకుతున్నామని ఎవలీన్ తెలిపారు. తమ పిల్లలను మాత్రం కలిసే పెంచుతామని కూడా స్పష్టం చేశారు. కాగా.. ఎవలీన్ శర్మ 2012లో హిందీ సినీ ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చారు. 2019 వరకు పలు హిందీ చిత్రాలలో కనిపించారు. ఆమె 2013లో విడుదలైన 'యే జవానీ హై దీవానీ' మూవీలో మెప్పించింది. అంతేకాకుండా 2014లో విడుదలైన 'యారియాన్', 'మై తేరా హీరో' చిత్రాల్లో కూడా నటించింది. తెలుగులో ప్రభాస్ మూవీ సాహోలో ఐషా పాత్రలో ఆకట్టుకుంది.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034.  Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034